ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
01-08-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 333 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి




## కేటీఆర్ వర్సెస్ సీతక్క

జయభేరి, హైదరాబాద్, జూలై 31

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడో రోజు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం ద్రవ్య వినిమయ బిల్లును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఇందుకోసం బుధవారం కూడా ప్రశ్నోత్తరాలు రద్దు చేశారు. ప్రస్తుతం ఉభయ సభల్లో ద్రవ్య వినిమయ బిల్లుపై సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ మొదలైంది. మొదట బీఆర్ఎ స్ సభ్యుడు కేటీఆర్ చర్చను ప్రారంభించారు.తెలంగాణ ఏర్పాటు సమయంలో తెలంగాణ చీకట్లో నిండిపోతుందని సరిగ్గా పదేళ్ల క్రితం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అలాగే తెలంగాణ వారికి పాలించే సత్తా ఉందా అని ఉమ్మడి రాష్ట్రంలో చాలామంది అన్నారని గుర్తు చేశారు. అలాగే ఈ పదేళ్లల్లో రాష్ట్ర సంపద పెరిగిందని గతంలో భట్టి విక్రమార్క చెప్పారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తున్నారన్నారు.బడ్జెట్‌లోని అంశాలు మేనిఫెస్టో లేవని కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణ బడ్జెట్ అద్భుతంగా ఉందని ఆర్‌బీఐ చెబుతుందని, రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్ తో అప్పగించామన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై విస్తృతంగా చర్చ జరగాలని, అవసరమైతే అర్ధరాత్రి వరకు చర్చ జరపాలన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది మీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. మీ హయాంలో అర్హత లేనివారికి పథకాలు ఇచ్చారన్నారు. మీరు పదేళ్లుగా చేయని పనులు చేసి చేపిస్తున్నామన్నారు.

గత పదేళ్లు బీఆర్ఎస్ పాలన కోట శ్రీనివాస్ కోడి కూర కథలాగా ఉండేదన్నారు. లక్షల మంది పేదలు ఇళ్లు లేక బాధపడుతున్నారని, బీఆర్ఎస్ పదేళ్లలో ఎవరికి ఇళ్లు ఇచ్చిందో చెప్పాలన్నారు.ఉద్యోగ విషయంలో కేటీఆర్ మాట్లాడుతుంటే నవ్వొస్తుందన్నారు. మేం ప్రకటించిన పథకాలకు కొంత పెంచి ప్రకటించారని, అప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా ? అని ప్రశ్నించారు. మా ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. త్వరలోనే ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తామన్నారు. అబద్ధాలను సైతం అద్భుతంగా చెప్పడంలో కేటీఆర్ దిట్ట అని మంత్రి సీతక్క సెటైర్ వేశారు. పదేళ్లుగా ఉద్యోగాలు ఇస్తే..ఉస్మానియా యూనివర్సిటీకి ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. డబుల్ పెన్షన్ తీసుకుంటున్న లక్ష్మ నుంచి రికవరీ చేశారని, ఈ విషయం మా దృష్టికి రాలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కార్పొరేషన్ చైర్మన్లు కూడా పెన్షన్ తీసుకున్నారన్నారు. సాగు చేసుకుంటున్న రైతులకు ధరణిలో పేరు లేదని రైతుబంధు నిలిపివేశారన్నారు. ప్రతిరోజు ధనిక రాష్ట్రం, బంగారు తెలంగాణ అంటే.. బయట ఉన్నా మేము నిజమేనని అనుకున్నామన్నారు. బీఆర్ఎస్ జరుగుతున్న అవినీతిని తట్టుకోలేక ప్రజలు మాకు అధికారం ఇచ్చారన్నారు.

# తగ్గేదేలే

ప్రతిపక్ష, అధికార సభ్యుల మధ్య మాటల యుద్ధం




**తెలంగాణ బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ప్రతిపక్ష, అధికార సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. తగ్గేదేలే అన్న చందంగా నేతలు ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పిచ్చుకుంటున్నారు. బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఘాటు విమర్శలు చేశారు. 'కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు పత్రాన్ని కూడా కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన సబితా ఇంద్రారెడ్డితోనే ఇప్పించారు. ఆరోజు మా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కూడా చేర్చుకున్నారు. మరి వాళ్లను కూడా రాజీనామా చేయించి బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకున్నారా?' అంటూ సీతక్క ప్రశ్నల వర్షం కురిపించారు. వెంటనే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నన్ను ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థంకావడంలేదు. నేను కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడే రేవంత్ రెడ్డి జాయిన్ అయ్యారు. ఆరోజు రేవంత్ రెడ్డిని నేను ఒక అక్కగా కాంగ్రెస్ పార్టీలోకి సంతోషంగా ఆహ్వానించాను. నువ్వు ఖచ్చితంగా సీఎం అవుతావంటూ కూడా రేవంత్ రెడ్డికి చెప్పా.**

జయభేరి, హైదరాబాద్, జూలై 31

మనస్ఫూర్తిగా రేవంత్ రెడ్డిని ఆశీర్వదించాను. ఆ విధంగా చూసిన నాపై రేవంత్ రెడ్డి ఎందుకు ఇంతలా కక్ష చూపిస్తున్నారు..?' అంటూ ఆమె అసెంబ్లీలో పేర్కొన్నారు.ఆ వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. 'ఆరోజు సబితక్క నన్ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన మాట వాస్తవమే. వ్యక్తిగతంగా జరిగిన సంభాషణ గురించి సభలో ఆమె ప్రస్తావించారు. సభలో ఆమె ప్రస్తావించారు కాబట్టి అడుగుతున్నా.. అప్పుడు జరిగిన పరిణామాలను కూడా సభలో సబితక్క వివరించాలి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నన్ను కోరింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే తాను కూడా అండగా ఉంటానంటూ సబితక్క కూడా నాకు సలహా ఇచ్చారు. అయితే, కాంగ్రెస్ పార్టీ నన్ను మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే సబితక్క బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేవలం అధికారంలో కోసం కాంగ్రెస్ పార్టీని వదిలి బీఆర్ఎస్ పార్టీలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. తమ్ముడిగా నాకు మోసం చేశారు కాబట్టే ఆమెను నమ్మొకండి అంటూ అప్పుడు కేటీఆర్ కు చెప్పాను. అంతేకాదు.. ఆరోజు మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే నిన్ను గెలిపించే బాధ్యత నాదే అంటూ సబితక్క నాకు భారీ భరోసా ఇచ్చారు. నేను చెప్పింది నిజమో కాదో అనేది సబితక్కనే చెప్పాలి' అంటూ రేవంత్ రెడ్డి అన్నారు.

## వారం ముందే కేంద్రం హెచ్చరిక


### కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదన్న అమిత్ షా

జయభేరి, న్యూఢిల్లీ, జూలై 31



వయనాడ్ విపత్తుపై రాజ్యసభలో కేంద్రమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ముందస్తు హెచ్చరికలు ఇచ్చినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. జులై 23వ తేదీనే కేరళ ప్రభుత్వాన్ని హెచ్చరించామని స్పష్టం చేశారు. కొండచరియలు విరిగి పడే ప్రమాదముందని, భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతుందని ముందే అప్రమత్తం చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఈ ఘటనలో 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 200 మంది తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 180 మంది గల్లంతయ్యారు. కేరళలో భారీ వర్షాలు మొదలైన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రానికి 9 NDRF బృందాలను పంపినట్టు వివరించారు అమిత్ షా. కానీ కేరళ ప్రభుత్వం ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల్ని సరైన సమయంలో అలెర్ట్ చేయలేదని, వాళ్లను వేరే చోటకు తరలించలేదని ఆరోపించారు. ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించే ప్రమాదముందని తెలిస్తే వారం రోజుల ముందే అలెర్ట్ చేసే టెక్నాలజీ భారత్ వద్ద ఉందని తేల్చి చెప్పారు. ప్రపంచంలో ఇలాంటి సాంకేతికత ఉన్న నాలుగు దేశాల్లో భారత్ కూడా ఒకటి అని తెలిపారు. కేరళ

...మిగతాది 2 లో



## సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటన

జయభేరి, శ్రీశైలం:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలంలో ర్యటించనున్న సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సీఎం పర్యటించే ప్రదేశాలలో పర్యటించి తీసుకోవలసిన భద్రత చర్యల గురించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి శ్రీశైలం చేరుకున్నప్పటినుండి తిరిగి వెళ్లే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 1100 మంది పోలీస్ అధికారులు వారి సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది.సుండిపెంట హెలిపాడ్ నుండి టెంపుల్ వరకు మరియు హెలిపాడ్ నుండి పవర్ ప్రాజెక్ట్ డ్యామ్ వరకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సుమారు 180 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తూ ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించారు..గ్రేహౌండ్స్ మరియు స్పెషల్ పార్టీ బలగాలతో శ్రీశైలం అడవులన్నింటిని జల్లెడ పట్టడం జరిగింది.

## దుమ్మురేపుతున్న జనసేన...



జయభేరి, విజయవాడ, జూలై 31:

ఏపీ పొలిటికల్ హిస్టరీలో జనసేనది ప్రత్యేక స్థానం. మొన్నటి వరకు ఫెయిల్యూర్ పార్టీ. కానీ ఈ ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించడంతో జనసేన పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. తన పార్టీ అభ్యర్థులు గెలవడమే కాదు.. ఏపీలో ఎన్డీఏ కూటమి గెలుపునకు కూడా పవన్ కళ్యాణ్ కారణమని నేషనల్ మీడియాలో ప్రత్యేక కథనాలు వచ్చాయి. ప్రధాని మోదీ అయితే పవన్ కాదు.. తుఫాన్ అంటూ వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ స్టామినాను జాతీయస్థాయిలో పెంచారు. 2014 ఎన్నికల నాటికి ఆవిర్భవించింది జనసేన. కానీ ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. రాష్ట్రంలో టిడిపికి, కేంద్రంలో బిజెపికి మద్దతు తెలిపారు పవన్. రెండు చోట్ల మద్ద తిచ్చిన వారే గెలిచారు. 2019 ఎన్నికల్లో ప్రత్యేక పరిస్థితుల్లో ఎవరికి వారే ఒంటరిగా పోటీ చేశారు. జనసేన ఒకచోట మాత్రమే గెలిచింది. రెండు చోట్ల పోటీ చేసిన పవన్ ఓడిపోయారు. దీంతో జనసేన అంటేనే ఒక రకమైన ప్రచారం ప్రారంభమైంది. అదొక పార్టీయేనా అని ఎగతాళి చేసిన వారు సైతం ఉన్నారు. ముఖ్యంగా వైసీపీ నేతలు జనసేన విషయంలో హేళనగా మాట్లాడేవారు.కానీ ఈ ఎన్నికల్లో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది జనసేన. పొత్తులో భాగంగా 21చోట్ల పోటీ

...మిగతాది 2 లో



## కవితకు నిరాశే..

జయభేరి, న్యూ ఢిల్లీఛ

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బుధవారం మరోసారి నిరాశ ఎదురైంది. ఈ స్కామ్‌కు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణ లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ,అరెస్ట్ చేసిన కేసులో కవిత జ్యుడిషియల్ రిమాండ్‌ను ట్రయల్ కోర్టు మరోసారి పొడిగించింది. ఆగస్ట్ 13 వరకు జ్యూడిషి యల్ రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎమ్మెల్సీ కవితను ఈ ఏడాది మార్చి 16న ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఈడీ కేసులో కవిత జ్యుడిషియల్ రిమాండ్ ముగియడంతో అధికారులు వర్చువల్‌గా ఆమెను న్యాయస్థానంలో హాజరు పర్చారు. కేసు విచారణ కీలక దశలో ఉన్నదని.. ఈ సమయంలో కవిత కస్టడీని పొడగించా లని ఈడీ తరుపు లాయర్లు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈడీ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం కవితకు మరో 14 రోజుల జ్యుడిషి యల్ రిమాండ్ విధించింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## వారం ముందే కేంద్రం హెచ్చరిక

ప్రభుత్వం కాస్త ముందే అప్రమత్తమై ఉంటే ఈ స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని అన్నారు. కేరళ ప్రభుత్వానికి మోదీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వయనాడ్ విపత్తుని కచ్చితంగా ఎదుర్కొంటామని వెల్లడించారు. "జులై 23వ తేదీన మేం కేరళ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశాం. కొండ చరియలు విరిగిపడే ప్రమాదముందని అప్రమత్తం చేశాం. 9 NDRF బృందాలను పంపాం. కానీ కేరళ ప్రభుత్వం ఏం చేసింది..? సరైన సమయంలో ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారా..? ఒకవేళ వాళ్లు ఆ పని చేసుంటే ఇంత మంది ఎందుకు చనిపోతారు..? 2016 లోనే ముందస్తు హెచ్చరికలు చేసే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. వారం రోజుల ముందే అలెర్ట్ చేసే టెక్నాలజీ మన దగ్గరుంది"

అమిత్ షా, కేంద్రహోం మంత్రి ఇప్పటికే కేంద్రమంత్రి జార్జ్ కురియన్ అక్కడి పరిస్థితులు సమీక్షించేందుకు వెళ్లారు. రిలీఫ్ క్యాంప్‌లలో తలదాచుకున్న బాధితులను పరామర్శించారు. రెస్క్యూ ఆపరేషన్ ఎలా జరుగుతోందో సమీక్షించారు. కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి 160 మంది ప్రాణాలు కోల్పోయారని సమాచారం అందింది. అయితే..ఈ మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. కొంత మంది శిథిలాల కింద చిక్కుకున్నారని వెల్లడించారు.

## దుమ్మురేపుతున్న జనసేన...

చేసి విజయం సాధించింది. శత శాతం విజయాన్ని నమోదు చేసుకుంది. అయితే క్షేత్రస్థాయిలో జనసేనకు ఉండే అభిమానులు సంఘటితం కావడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. ఇప్పుడు మరో రికార్డుకు దగ్గరగా ఉంది జనసేన. పది లక్షల సభ్యత్వ నమోదు దాటడం విశేషం.పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం పై నాయకత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఈ నెల 18 నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభించారు. అయితే వారం రోజుల వ్యవధిలోనే 10 లక్షల సభ్యత్వాలు నమోదు కావడం విశేషం. అందుకే ఈ సభ్యత్వ నమోదు గడువును పెంచింది జనసేన. మరో వారం రోజులపాటు సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని సూచించింది. ఈ మేరకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని వెల్లడించారు.ప్రతి నియోజకవర్గంలో 5000 మంది క్రియాశీల సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.జనసేన విజయం సాధించిన నేపథ్యంలో ఈ ఏడాది సభ్యత్వ నమోదు సంఖ్య పెరగడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలతో పాటు తెలంగాణలో కూడా సభ్యత్వాలు జరుగుతున్నాయి. అయితే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించి వర్షాలు అడ్డంకిగా నిలిచాయి. అందుకే వారం రోజులు పాటు గడువు పెంచారు.వాస్తవానికి జనసేన ఆవిర్భావం నుంచి సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. కానీ ఇప్పుడు ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం పెరగడం, ద్వితీయ శ్రేణి క్యాడర్ పెరగడం కారణంగానే సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.ఇద్దరు ఎంపీలు కూడా కొనసాగుతున్నారు. జనసేనకు మూడు మంత్రి పదవులు దక్కాయి. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా, ఆరు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు వైసీపీ నుంచి జనసేనలో చేరికలు పెరిగే అవకాశం ఉంది. కానీ గెలిచి 50 రోజులు కూడా దాటకపోవడంతో ఎవరికీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. అయితే ముమ్మందు చేరికలు పెరిగే అవకాశం ఉంది. అదే జరిగితే జనసేన బలం అమాంతం పెరగనుంది. ఏదిఏమైనా క్షేత్రస్థాయిలో జనసేన బలం పెరుగుతుండడం విశేషం.

---

### కనీసం శ్రావణంలో అయినా...

# మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా



✍ జయభేరి, హైదరాబాద్, జూలై 31:

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఆషాఢం ముగిసి... శ్రావణ మాసం వస్తుండడంతో.. ఉందిలే మంత్రీ కాలం ముందు ముందునా అని పాడుకుంటున్నారు. రేవంత్ కేబినెట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. నెల రోజుల క్రితమే సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లడం, కాంగ్రెస్ సీనియర్లు కూడా హస్తినకు వెళ్లడంతో.. మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అప్పట్లో బాగా ప్రచారం జరిగింది. అయితే కూడికలు తీసివేతలు ఓ కొలిక్కి రాలేదో ఏమో గానీ.. ఆషాఢం ఆశలకు ఫుల్ స్టాప్ పడింది. శ్రావణంలో మంత్రి వర్గం విస్తరణ చేద్దాం, అప్పుడే చూద్దాం అని అధిష్టానం చెప్పడంతో ఈ ఆశలకు టెంపరరీగా కామా పడింది.అయితే ఇప్పుడు శ్రావణ మాసం ముంచుకొస్తున్న శుభ ముహూర్తాన ఆశావహుల్లో మళ్లీ కదలిక మొదలైంది. మంత్రివర్గ బెర్తులపై కర్చీఫులు వేయడం మొదలైంది. మొన్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, తుంగతుర్తి ఎమ్మెల్యే శామ్యూల్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు... సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. తమ సామాజిక వర్గాన్ని కూడా దృష్టిలో పెట్టుకోండి అంటూ సీఎం దృష్టిలో పడ్డారు.ఇక లేటెస్ట్‌గా ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 34 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ తరఫున గెలిచింది తాను ఒక్కడినే కాబట్టి, మంత్రివర్గం విస్తరణలో తనకు అవకాశం వస్తుందంటున్నారు ఆయన. మూడు సార్లు గెలిచిన సీనియర్ కావడంతో, ఆషాఢం తర్వాత అవకాశం ఉంటుందని ఆయన బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా తనకు చాన్స్ ఉంటుందని నమ్ముతున్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్.. ఎస్టీ కోటాలో కర్చీఫ్ వేసుకుని కూర్చున్నారు. ఆశావహుల జాబితాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. చెన్నూరు ఎమ్మెల్యే, మాల సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత గడ్డం వివేక్ కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన గతంలో ఎంపీగా కూడా పనిచేశారు.మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరు కూడా గట్టిగానే వినిపిస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ స్వయంగా ప్రకటించడం.. శ్రీహరికి కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు పేరు కూడా ఆశావహుల జాబితాలో ఉంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కూడా తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే 6 బెర్తులు ఖాళీగా ఉన్నా...ప్రస్తుతం ఐదుగురిని కొత్తగా మంత్రి వర్గంలోకి తీసుకుంటారని, మైనారిటీ కోటాను తర్వాత భర్తీ చేస్తారని చెబుతున్నారు.పలువురు ఆశావహులు...శ్రావణ పల్లకీలో విహరిస్తున్నారు.

# అంతులేని కథ...

✍ జయభేరి, కరీంనగర్, జూలై 31:



కాళేశ్వరం ప్రాజెక్ట్ పై మాటల మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎలాగైనా ఆ ప్రాజెక్ట్ తో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని చెప్పుకోవాలన్న ఆరాటంలో బీఆర్ఎస్ ఉంది. అందుకే కేటీఆర్ సహా గులాబీ నేతల బృందం కాళేశ్వరం వెళ్లి పరిశీలించి వచ్చారు. అక్కడితో మ్యాటర్ ఆపకుండా కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును దెబ్బతీశారని తనకు ఎప్పటినుంచో అనుమానం ఉందని కేటీఆర్ చెప్పడం ఇప్పుడు అసలు ట్విస్ట్.కాళేశ్వరంపై ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చాలా డైలాగ్ వార్ నడిచింది. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని అని బీఆర్ఎస్.. అప్పుల కుప్ప ఒక్క ఎకరాకూ నీళ్లు దక్కే పరిస్థితి లేదని కాంగ్రెస్ ఇలాంటివెన్నో మాటల యుద్ధాలు నడిచాయి. అసలు ప్రాజెక్టు తుమ్మిడిహెట్టి దగ్గర కాకుండా కట్టడం, డిజైన్లు మార్చడం, నాసిరకం నిర్మాణాలంటూ కాంగ్రెస్ ఎదురుదాడులు చేసింది. అటు మేడిగడ్డ కుంగడంతో బీఆర్ఎస్ కూడా డిఫెండ్ చేసుకునేలా అన్ని ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. తాజాగా ఇదే కాళేశ్వరంపై తెరపైకి వచ్చిన కొత్త విషయం ఏంటంటే.. గులాబీ నేతలు మొన్నామధ్య కాళేశ్వరం పర్యటనకు వెళ్లివచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్స్ తో ఇప్పుడు మరోసారి ఈ ప్రాజెక్టు గురించి చర్చ మొదలైంది. అసలు కేటీఆర్ ఏమన్నారంటే.. మేడిగడ్డ 28 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకుని నిలబడిందని అలాంటిది... ఏ వరదా లేనప్పుడు ప్రాజెక్టు ఎలా కుంగిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును దెబ్బతీశారని తనకు ఎప్పటినుంచో అనుమానం ఉందంటూ మాట్లాడారు. రేపు ప్రాజెక్టుకు ఏదైనా జరగకూడనిది జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని, కాళేశ్వరాన్ని ఏదైనా చేస్తారనే డౌట్ కూడా ఉందన్నారు కేటీఆర్కాబట్టి కాళేశ్వరంపై కొత్త కథలను కేటీఆర్ ఎత్తుకున్నారు. ఇప్పటికే మేడిగడ్డ కుంగడం, అన్నారం, సుందిళ్లలో బుంగలు పడడం, ఎక్కువ నీటిని నిల్వ చేస్తే అసలుకే ప్రమాదం అని ఇప్పటికే NDSA స్పష్టం చేసింది. దీంతో వరద వచ్చింది వచ్చినట్లు కిందికి వదిలేస్తున్నారు. అలాంటిది లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకున్న మేడిగడ్డ బరాజ్.. ఏ వరదా లేనప్పుడు ఎలా కుంగిందో అర్థం కావడం లేదంటూ కొత్త డౌట్లను తెరపైకి తేవడం అంతా పకడ్బందీ ప్లాన్‌లో భాగమే అంటున్నారు. కాళేశ్వరం డ్యామేజ్ నుంచి సబ్జెక్ట్ డీవియేట్ చేయడమన్న వాదన వినిపిస్తోంది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డలోని ఏడో బ్లాక్ లోని నాలుగు పిల్లర్ల దగ్గర పెద్ద శబ్దంతో క్రాక్స్ వచ్చి పిల్లర్లు కుంగాయి.అప్పుడు బరాజ్ కుంగిపోవడానికి ముందు పేలుడు వంటి శబ్దం వచ్చిందన్న స్టోరీలు వినిపించారు. మహారాష్ట్ర వైపు నుండి 3 మీటర్ల దూరంలో 20వ పిల్లర్ వద్ద శబ్దం వచ్చిందన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రవాణాకు సంబంధించి ఈ రెండు వ్యవస్థలు నిత్యం నిశిత పరిశీలన జరుపుతుంటాయి. అయినప్పటికీ మేడిగడ్డ కుంగుబాటును ఇంకేదో ఖాతాలో వేసుకుని తప్పించుకునే ప్రయత్నాలు అప్పుడు జరిగాయి. కానీ విద్రోహ చర్య ఏదీ లేదని అప్పట్లోనే నిపుణులు, భద్రతా సిబ్బంది తేల్చేశారు. NDSA టీమ్ ఢిల్లీ నుంచి వచ్చి పరిశీలన జరిపి, కుంగుబాటుకు కారణాలు వెల్లడించింది. మధ్యంతర నివేదిక ఇచ్చింది. రిపేర్లు పూర్తయ్యేదాకా గేట్లు ఓపెన్ చేసి పెట్టాలన్నదిలక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం కట్టారు. అసలు డిజైన్ చేసింది తానే అని ఒక సందర్భంలో కేసీఆర్ చెప్పుకున్నారు. మెదడు, రక్తం కరిగించి కట్టానన్నారు. బరాజ్ కుంగిన తర్వాత ప్రశ్న అడిగితే.. తనకు తెలియదని, అంతా ఇంజినీర్లదే అని అన్నారు. సో ఒక అబద్ధాన్ని నిజం చేయడం కోసం, అలాగే ఒక తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం కొత్త వ్యూహాలకు బీఆర్ఎస్ నేతలు తెరలేపుతున్నారన్న వాదన వినిపిస్తోంది. కేసీఆర్ కుటుంబం కమీషన్ల కక్కుర్తి కోసం రాష్ట్ర నీటిపారుదలరంగాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టును సర్వనాశనం చేసిందని కేసీఆర్, కేటీఆర్‌పై మంత్రి ఉత్తమ్ విరుచుకుపడ్డారు. కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ.. ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారంలో గోబెల్స్‌ను కేటీఆర్ మించిపోయారంటూ కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం కట్టినప్పుడు.. కూలినప్పుడు అధికారంలో ఉన్నది కేసీఆర్ కుటుంబమే అన్న విషయాన్ని కేటీఆర్ కు గుర్తు చేశారు.కూలిన తర్వాత 45 రోజులు వారే అధికారంలో ఉన్నారన్నారు. రీడిజైనింగ్, రీఇంజనీరింగ్‌తోనే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. సో ఇప్పుడు గోదావరిలో వరద వస్తోంది. ఆ నీటిని ఎత్తి పోయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నిజానికి ఎక్కడికి ఎత్తిపోయాలి.. ఎక్కడ నిల్వ ఉంచాలి.. నిల్వ ఉంచితే వచ్చే ప్రమాదాలు.. ఇవన్నీ తెలియవా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇంత చేసి కాళేశ్వరం టూర్ కు వెళ్లిన గులాబీ బ్యాచ్.. మేడిగడ్డలో తప్పు జరగలేదు అన్న విషయాన్ని కూడా చెప్పలేకపోయిందంటున్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయారని అంటున్నారు NDSA రిపోర్ట్ బీజేపీ ఆఫీస్ లో తయారు చేసిందే అని, ఎన్డీఎస్ఏకు పోలవరంపై లేని శ్రద్ధ కాళేశ్వరంపై ఎందుకని కేటీఆర్ ఇటీవలే చేసిన కామెంట్లపై బండి మండిపడ్డారు. అయితే కాళేశ్వరంలో తప్పు జరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నట్టేనా అని ప్రశ్నించారు. పోలవరానికి కాళేశ్వరానికి లింక్ ఎందుకన్నారు. పోలవరంలో తప్పు జరిగితే.. ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతేగానీ.. కాళేశ్వరం తప్పులను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గుర్తిస్తే తట్టుకోలేకపోతున్నారంటున్నారు. కాబట్టి కాళేశ్వరం కథలకు ఇప్పట్లో ఫుల్ స్టాప్ పడేలా కనిపించడం లేదు. కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు, డౌట్లు, విచారణలు ఇవన్నీ మరింతకాలం కొనసాగడం ఖాయంగానే కనిపిస్తోంది.

---

# పీకే ఆశలు ఫలించేనా



✍ జయభేరి, పాట్నా, జూలై 31:

పీకే... అలియాస్ ప్రశాంత్ కిషోర్.. దేశ రాజకీయాల్లో దశాబ్దాలుగా వినిపిస్తున్న మాట ఇది. ఎన్నికల వ్యూహకర్తగా తెరపైకి వచ్చిన ఆయన ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారు. జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలకు విజయాలను అందించారు. ఎన్నికల వ్యూహ కర్తగా విశేష సేవలు అందించారు. ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా పరకాయ ప్రవేశం చేయనున్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించనున్నారు. రెండేళ్ల కిందకి ఆయన జన్ సూరజ్ అనే సంస్థను ప్రారంభించారు. భవిష్యత్తులో దానిని రాజకీయ పార్టీగా మారుస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వచ్చే అక్టోబర్ 2న పార్టీని ప్రారంభిస్తున్నానని.. పార్టీ నాయకత్వంతో పాటు విధి విధానాలను త్వరలో వెల్లడిస్తానని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు. బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ ఐక్యరాజ్యసమితిలో పనిచేశారు. ఐదేళ్లపాటు అక్కడే విధులు నిర్వహించారు. తరువాత ఎన్నికల వ్యూహకర్తగా మారారు. 2012లో తొలిసారిగా గుజరాత్ లో బిజెపి తరఫున వ్యూహ కర్తగా పనిచేశారు. నరేంద్ర మోడీ మూడోసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా చేయడంలో ప్రశాంత్ కిషోర్ కీలకపాత్ర పోషించారు. అదే అనుభవంతో 2014లో మోడీ నేతృత్వంలోని బిజెపి గెలుపునకు దేశవ్యాప్తంగా బిజెపి తరఫున పనిచేశారు. ప్రధాని పీఠంపై మోదీని కూర్చోబెట్టడంలో సక్సెస్ అయ్యారు. అప్పటినుంచి ప్రశాంత్ కిషోర్ పేరు మార్మోగింది. ఆయన సేవల కోసం రాజకీయ పార్టీలు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

దేశవ్యాప్తంగా చాలా పార్టీలకు వ్యూహకర్తగా పనిచేసే విజయాలను అందించారు. అదే సమయంలో కొన్ని అపజయాలను సైతం మూటగట్టుకున్నారు.2019 ఎన్నికలకు ముందు వైసీపీకి వ్యూహకర్తగా నియమితులయ్యారు ప్రశాంత్ కిషోర్. ఆ ఎన్నికల్లో జగన్ గెలుపునకు భారీగా వ్యూహాలు పన్నారు. అవి సక్సెస్ అయ్యాయి కూడా. ప్రజలను కుల, మతాలు, వర్గాలుగా విభజించి.. యూటర్న్ చేయడంలో ప్రశాంత్ కిషోర్ అంది వేసిన చేయి. ఆ ఎన్నికల్లో జగన్ గెలిచిన తర్వాత.. ప్రశాంత్ కిషోర్ తో విభేదాలు ఏర్పడ్డాయి. అందుకే ప్రశాంత్ కిషోర్ చంద్రబాబుతో చేతులు కలిపారు. ఈ ఎన్నికల్లో జగన్ కు దారుణ పరాజయం తప్పదని హెచ్చరించారు. ఊహించని ఓటమి ఎదురవుతుందని కూడా తేల్చి చెప్పారు. అదే మాదిరిగా జగన్ కు ఘోర పరాజయం ఎదురు కావడంతో ప్రశాంత్ కిషోర్ జోష్యం ఫలించింది ఒక్క జగన్ కే కాదు. ప్రశాంత్ కిషోర్ చాలా రాజకీయ పార్టీలకు సేవలు అందించారు. పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయానికి కూడా కృషి చేశారు. అయితే ఏ పార్టీతో అయితే పని చేస్తారో.. అదే పార్టీ అధినేతతో విభేదాలు పెంచుకుంటారు ప్రశాంత్ కిషోర్. ప్రధాని మోదీతో పనిచేసిన ఆయన.. అదే మోదీని వ్యతిరేకించారు. కాంగ్రెస్ కు దగ్గర అవుతూనే.. అదే పార్టీ విధానాలను ఎండగట్టారు. అందుకే ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ శత్రువులు ఎక్కువ. గతంలో పీకేను బందిపోటుతో పోల్చిన చంద్రబాబుకే రాజకీయ సలహాలు ఇచ్చారు.సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయు పార్టీలో చేరారు ప్రశాంత్ కిషోర్. కానీ ఆ పార్టీలో ఎక్కువ రోజులు ఉండలేకపోయారు. 2018లో జేడీయులో చేరిన పీకే.. 2020లో బహిష్కరణకు గురయ్యారు. పౌరసత్వ సవరణ చట్టం విషయంలో నితీష్ కు వ్యతిరేకంగా ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించడంతో.. పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వెంటనే బీహార్లో కొత్త రాజకీయ పార్టీకి పావులు కదపడం ప్రారంభించారు. తొలుత జన సూరజ్ అనే సంస్థను స్థాపించారు. ఇప్పుడు అదే సంవత్సరం రాజకీయ పార్టీగా మార్చనున్నారు. ఆయన పార్టీతో ఎవరికి గండి పడుతుందో చూడాలి.



## పవన్ కళ్యాణ్ కీలక ప్రకటన

✍ జయభేరి, విజయవాడ,, జూలై 31:

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధి హామీ కూలీలకు శుభవార్త తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం అదనంగా 6.50 కోట్ల పని దినాలు కేటయించినట్లు పవన్ పవన్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనంగా 6.50 కోట్ల పనిదినాలు కేటాయించింది.ఇదిలా ఉంటే ఇప్పటికే కేటాయించిన 15 కోట్ల పనిదినాలు జూన్ నెలాఖరుకే పూర్తయ్యాయి. అయితే అదనపు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో మంగళవారం దిల్లీలో నిర్వహించిన సమావేశంలో మరో 6.50 కోట్ల పనిదినాలకు ఆమోదం తెలిపినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. దీంతో ఉపాధి హామీ కూలీలకు మరిన్ని ఎక్కువ రోజులు ఉపాధి లభించనుంది. పెరిగిన పని దినాల వల్ల ఉపాధి హామీ పథకంలో పని చేసే 54 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.ఇదిలా ఉంటే మొదట మంజూరు చేసిన 15 కోట్ల పని దినాలు జూన్ నెలాఖరుకే పూర్తికాగా, అదనపు పని దినాల కోసం ప్రతిపాదనలు పంపగా, ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను అంగీకరించారని పవన్ చెప్పుకొచ్చారు. అదే విధంగా ఇప్పటి వరకు ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సి బకాయిలను సత్వరమే విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లు కేంద్ర ప్రభుత్వం సమ్మతించినట్లు పవన్ తెలిపారు. ఇందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు.కాగా.. అటవీశాఖ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని పవన్ హెచ్చరించారు. పల్నాడు జిల్లా విజయపురి సౌత్‌రేంజ్ అటవీ పరిధిలో వన్యప్రాణులను అక్రమ రవాణా చేసే ముఠాను అదుపులోకి తీసుకునే క్రమంలో అటవీశాఖ ఉద్యోగులపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఈ విషయానికి సంబంధించి ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# ఉప్పల్ బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు

- బోనాల పండుగను పురస్కరించుకొని అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం: కార్పొరేటర్ బన్నాల

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ బోనాల పండుగను పురస్కరించుకొని చిల్కా నగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి వివిధ శాఖల అధికారులతో కార్పొరేటర్ క్యాంప కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో అన్ని విభాగాల అధికారులతో మాట్లాడుతూ బోనాల పండుగకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారు రోడ్ల పైన గుంటలు లేకుండా బీటీ పేచులు వేయాలని, శానిటేషన్ డిపార్ట్మెంట్ వారు అన్ని ఆలయాల వద్ద ప్లాస్టిక్ కవర్లు ఇవ్వాలని, బ్లీచింగ్ పౌడర్ ను చల్లి గుడి పరిసర ప్రాంతాలలో శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, ఎంటమాలజీ విభాగం వారు గుడి పరిసర ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేయాల్సిందిగా ఆదేశించడం జరిగింది, అదేవిధంగా వాటర్ వర్క్స్ విభాగం అధికారులు ప్రజలకు మంచినీళ్ల లోటు లేకుండా సమయానుసారం మంచినీళ్లు సరఫరా చేయాలని ఆలయాలకు వెళ్లేదారిలో ఎటువంటి లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ సిబ్బంది ఆలయాలకు వెళ్లే దారిలో చెట్ల కొమ్మలను గుర్తించి పండగలోపు తొలగించాలని ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం రజనీకాంత్ రెడ్డి, ఏఈ రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ రాజ్ కుమార్, శానిటేషన్ విభాగం డిఈ చందన, శానిటేషన్ సూపర్వైజర్ రాజేశ్వర్ రెడ్డి, ఎంటమాలజీ డిపార్ట్మెంట్ ఏఈ నరేష్ రెడ్డి, వారి సిబ్బంది అజయ్, శేఖర్, బాలు, కేదార్, మొదలగు వారు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం

- వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు

**జయభేరి, జులై 31:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ కార్యాలయంలో వన మహోత్సవం మరియు వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ లు, వార్డు అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే ప్రణాళిక అదేవిధంగా వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశంలో చర్చించి సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందచేశారు.

## అద్రాస్ పల్లిలో దాడి కేసులో పలువురు అరెస్టు

- కోర్టులో నిందితులను హాజరు పరిచిన పోలీసులు
- నిందితులకు రిమాండ్ విధింపు



**జయభేరి, జులై 31:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అద్రాస్ పల్లి గ్రామంలో ఇటీవల ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. కాగా ఈ కేసు నుండి ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు నమోదు చేసినట్లు శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ వెల్లడించారు. కాగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం ఈ కేసులో నిందితులుగా ఉన్న జీడి నరసింహ, జీడి మల్లేష్, జీడి జనార్దన్, జూపల్లి నాగరాజు, ఠాక్రే అర్జున్ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్ కు తరలించామన్నారు.

## మజీద్ పూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం

- ప్రతీ పౌరుడు తమ హక్కుల కోసం పోరాడాలని వక్తల పిలుపు



**జయభేరి, జులై 31:**

మేడ్చల్ జిల్లా, శామీర్ పేట్ మండలం మజీద్ పూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం పౌర హక్కులపై మరియు రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన చట్టాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లడుతూ రాజ్యాంగంలో పౌరులకు ఉన్న హక్కులు ఒక్కోసారి అణిచి వేతకు గురవుతున్నాయని అన్నారు. ప్రతీ పౌరుడు హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతా బాయి, ఆర్ ఐ కుమార్, కార్యదర్శి వేణుగోపాల్, కారోబార్ వీరేష్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

- వెనుకబడిన వర్గాల ప్రజల కోసం ప్రత్యేక చట్టాలను అమలు చేయాలి - మాజీ సర్పంచ్ జాం రవి



**జయభేరి, జులై 31:**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడివో వాత్సలదేవి, తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాం రవి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల కోసం రాజ్యంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి అందరికీ సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. రాజ్యాంగంలో దళిత, గిరిజనుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని పౌరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మంగతాయారు, డిప్యూటి తహశీల్దార్ నాగజ్యోతి, ఆర్ ఐ రాఘువ, ఏ ఎస్ ఐ నాను నాయక్, గ్రామ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ విరమణ అధికారికి ఆత్మీయ సన్మానం

**జయభేరి, ఇల్లందు :**

ఇల్లందు ఏరియా లోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందనున్న యాన్.శేషు కుమార్ జూనియర్ ఇంజనీర్ (సివిల్) ను ఇల్లందు ఏరియా జియం జాన్ ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు మరియు ఉద్యోగులు శాలువా పుష్ప గుచ్ఛం మరియు జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వారు సింగరేణి సంస్థ నందు గత 42 సంవత్సరాలు గా పని చేస్తూ అందరి మన్ననలు పొందారు. వారు ఇల్లందు ఏరియా సివిల్ విభాగంలో 34 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన వారని వారు ఈ రోజు పదవి విరమణ పొందారు, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూజియం మల్లారపు మల్లయ్య, ఎ.జియం(ఐఇ) గిరిధర్ రావు,ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, డిజియం(పర్సనల్)జి.వి మోహన్ రావు, డీజీఎం సివిల్ రవికుమార్ ఇతర అధికారులు ధనుంజయ రెడ్డి, దిలీప్ కుమార్, యూసఫ్, మధు బాబు, నాగేశ్వరరావు, సతీష్ గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి లచ్చిరం, ప్రాతినిధ్య సంఘం పిట్ కార్యదర్శి యాదగిరి ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొనారు.

## మందు బాబులారా తస్మాత్ జాగ్రత్త...

- పీర్జాదిగూడ దర్బార్ ఫ్యామిలీ అండ్ రెస్టారంట్ బార్ లో ఫుడ్ ఇన్స్పెక్టర్ల తనిఖీలు
- భారీగా బయటపడుతున్న కూలిపోయిన ఆహార పదార్థాలు
- ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న దర్బార్ ఫ్యామిలీ రెస్టారెంట్ బార్ ను వెంటనే తొలగించాలంటూ మహిళా సంఘాలు ఆందోళన



**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలోని దర్బార్ బార్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో కుళ్లిన ఆహారపదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారంతో సదరు రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమీషన్ హైదరాబాద్ ఛైర్మన్ దత్తాత్రేయ ఫిర్యాదు మేరకు దర్బార్ రెస్టారెంట్ లో ఫుడ్ ఇనస్పెక్టర్ ధర్మేందర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేసి కుళ్లిన,గడువు మీరిన ఆహారపదార్థాలు సీజ్ చేసి పరీక్షలకు పంపారు...కాగా కుళ్లిన,తేదీ మీరిన ఆహారపదార్థాలు అమ్మి వినియోగదారుల అనారోగ్యానికి కారణం అవుతున్న రెస్టారెంట్లు , హోటళ్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని దత్తాత్రేయ అధికారులను డిమాండ్ చేశారు.



# కోనోకార్ప్స్ మొక్కలు పర్యావరణానికి హాని

- దేవరకొండ మున్సిపల్ కమిషనర్ కి విజ్ఞప్తి

**జయభేరి, దేవరకొండ :**




భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ అధ్యక్షులు గుండాల అంజయ్య ఆధ్వర్యంలో హరితహారం లో భాగంగా వివిధ ప్రాంతాల్లో పెంచిన కోనోకార్ప్స్ మొక్కలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి ప్రభుత్వం గుర్తించి వాటిని నిషేధించారు కానీ ఎక్కడ కూడా వీటిని తొలగించలేదు దేవరకొండ పట్టణంలో రోడ్ డివైడర్ మధ్యలో నాటిన చెట్లు విపరీతంగా పెరిగి పర్యావరణాన్ని హాని చేస్తున్నాయి వీటివల్ల శ్వాస కోసం వ్యాధులు సైతం వస్తున్నాయి ఇప్పటికే గుర్తించారు కావున ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత త్వరగా వాటిని తొలగించి వాటి స్థానంలో పకృతి సిద్ధమైన చెట్లు పెంచాలని భారతీయ జనతా పార్టీ మున్సిపాలిటీ శాఖకు విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతల వెంకటేష్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకర్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు నారాయణదాసు చండీశ్వర్, వలసాని వెంకన్న, ఈడెం రవి, గంజి హరి, గుండాల అంజి, చిత్రం ఉదయ్, ఎర్ర బిక్ష పతి, పున్న వెంకటేశ్వర్లు, చిరముని మహేష్, శివ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు పూర్తి చేయాలి

## లబ్ధి దారులకు కేటాయించాలి

- బిజెపి కిసాన్ మోర్చా రాష్ట ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**జయభేరి, హైదరాబాద్ జులై 31:**



ఈ మేరకు ఆయన కరీంనగర్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ తో కలిసి ఆర్నకొండలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి అనంతరం జూలై 31 బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడారు.

**పాలకుల నిర్లక్ష్యం వలన**

చొప్పదండి ఆర్నకొండలలో డబల్ బెడ్ రూమ్ లు నిర్మాణం పూర్తి కాక, వినియోగంలోకి రాక వెచ్చించిన 14 కోట్ల రూపాయల ప్రజా ధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చొప్పదండిలో 169 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయిందని గత ఎనిమిది నెలలుగా డబల్ బెడ్ రూమ్ ల పురోగతి గురించి రివ్యూ చేయడానికి జిల్లా మంత్రికి తీరిక దొరకడం లేదని కలెక్టర్ కి సమీక్ష చేయడానికి సమయం ఉండక పోవటం శోచనీయమని అన్నారు. ఒకవైపు వరసగా కురుస్తున్న వర్షాలతో ఇల్లు లేని లబ్ధిదారులు తాటీపత్రిల కింద కూలిన ఇండ్లలో గుడిసెలలో నానా అగచాట్లు పడుతూ ఉంటే. మరోవైపు సగం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మేకల పాకలుగా పశువుల కొట్టాలుగా మారడం చూసిన చొప్పదండి ప్రజల గుండెలు తరుక్కుపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్నకొండలో నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు నంబర్లు కూడా కేటాయించబడ్డ డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేవలం కరెంట్ కనెక్షన్ నల్లా కనెక్షన్ ఇప్పించకపోవడం వలన లబ్ధిదారులు అందులో నివాసం ఉండలేకపోతున్నారని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం తక్షణము స్పందించి ఆర్నకొండలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు విద్యుత్,నీటి సౌకర్యం కల్పించాలని అదేవిధంగా చొప్పదండిలో నిలిచిపోయిన డబల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుపేద డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల పక్షాన.భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయిలో ఉద్యమాలకు శ్రీకారం చుడుతుందని ఆయన హెచ్చరించారు.

**కార్యక్రమంలో బిజెపి చొప్పదండి పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్**

బీజేపీ జిల్లా కార్యదర్శి చెపూరి సత్యనారాయణ,మాజీ అసెంబ్లీ కన్వీనర్ మొగిలి సారయ్య.ప్రధాన కార్యదర్శులు గొల్ల గట్టయ్య,చిల్లా శ్రావణ,భూపాల పట్నం మాజీ ఉపసర్పంచ్ బైరగోని కిట్టుగౌడ్, పాకాల మహేష్, దండే వెంకటేష్, ఎరుకల తిరుపతి గౌడ్, అమరగాని రాజు, దామెర మధుసూదన్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, మ్యాకల రాములు, జక్కుల అంజయ్య, మొగిలి మహేష్, శంకర్, గొల్లపల్లి మునీన్దర్, లబ్ధి దారులు మల్యాల కొండయ్య, జక్కుల పాపయ్య, శ్రీనివాస్ వెంకటవ్వ, రాజవ్వ, కాదాసి శోభ తదితరులు పాల్గొన్నారు.

## కారు బీభత్సం ఇద్దరికి గాయాలు

**జయభేరి, హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ చెక్పోస్టు వద్ద అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో బీటెక్ విద్యార్థి సాకేత్ రెడ్డి తన మిత్రుడితో కలిసి కారును డ్రైవింగ్ చేశాడు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు నుంచి కృష్ణానగర్ వైపునకు వెళ్లే మార్గంలో కారు అదుపు తప్పింది. కారు ఫుట్ పాత్ పైకి చేరుకుని చెట్లతో పాటు.. అక్కడున్న టెలిఫోన్ స్థంభంపై కెక్కి అమాంతంగా కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న సాకేత్ రెడ్డితో పాటు.. అతని మిత్రుడికి గాయాలయ్యాయి. కారులోపల ఇరుక్కుపోయిన ఇద్దర్నీ స్థానికులు బయటకు వెలికితీశారు. కారు డ్రైవర్ సాకేత్ రెడ్డికు పోలీసులు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. మద్యం మోతాదు 146 పాయింట్లుగా నమోదైంది. ప్రమాదంలో గాయపడ్డ ఇద్దర్నీ జూబ్లీహిల్స్ పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

# మూవీభేరి

## రొమాంటిక్ బచ్చన్

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్‌శంకర్ దర్శకుడు. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. ఈ సినిమా లోని రొమాంటిక్ మెలోడీ సాంగ్ 'జిక్కీ' ఈ నెల 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం కొత్తపోస్టర్‌ను విడుదల చేశారు. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాట మెలోడియస్ రొమాంటిక్ నెంబర్‌గా సంగీతప్రియుల్ని మెప్పిస్తుందని, నాయకానాయికలు రవితేజ, భాగ్యశ్రీ బోర్సే మధ్య కెమిస్ట్రీ హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా రవితేజ కనిపించనున్నారు. మాస్, కామెడీ, యాక్షన్ అంశాల కలబోతగా దర్శకుడు హరీష్‌శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, రచనదర్శకత్వం: హరీష్‌శంకర్.





## మాజీ సీఎం మనవడితో డేటింగ్..?

మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ ప్రస్తుతం ప్రేమలో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే తాను ప్రేమించే అబ్బాయి ఎవరో కాదు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండే మనవడు వీర్ పహారియా అని సమాచారం. జూలై 12న అనంత్ అంబానీ – రాధిక మర్చెంట్‌ల వెడ్డింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ పెళ్లికి సంబంధించిన ఈవెంట్‌లో వీళ్లిద్దరూ కలిసి ఉండడం.. కలిసి డ్యాన్స్ చేయడం చూస్తుంటే ఇద్దరు ప్రేమలో ఉన్నారని బాలీవుడ్ మీడియా కోడై కూస్తుంది. మరోవైపు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఓర్రీ కూడా ఒక వ్లాగ్ చేయగా.. ఈ వీడియోలో మానుషి చిల్లర్ – వీర్ పహారియా కలిసి ఉండడం వీర్ భుజంపై తల పెట్టుకొని మానుషి చిల్లర్ సేదతీరుతూ కనిపించడం చూస్తే ఈ వార్తలు నిజం అని తెలుస్తుంది. హరియాణాకు చెందిన మానుషి చిల్లర్ 2017లో ప్రపంచ సుందరిగా విజయం సాధించింది. అయితే విశ్వసుందరి అయిన సినిమా అవకాశాలు వరుసగా ఏం రాలేదు. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటించిన సామ్రాట్ పృథ్వీ రాజ్ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ భామ. అనంతరం తారిఖ్, ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ, బడేమియా ఛోటే మియా వంటి సినిమాలు చేసింది. ఇక తెలుగులో వరుణ్ తేజ్ నటించిన ఆపరేషన్ వాలెంటైన్‌లో హీరోయిన్‌గా మెరిసింది.

## డబుల్ మాస్ జాతర

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. రిలీజ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచారు. తాజాగా ఈ సినిమాకు డబ్బింగ్‌ను పూర్తి చేశారు హీరో రామ్. బుధవారం డబ్బింగ్ సెషన్ నుంచి వీడియోతో పాటు కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో రామ్ డబుల్ మాస్ అవతారంలో కనిపిస్తారని, ఓల్డ్‌సిటీ శంకర్‌గా ఆయన పాత్ర పవర్‌ఫుల్‌గా సాగుతుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, సినిమా విజయంపై పూర్తి కాన్ఫిడెంట్‌తో ఉన్నామని మేకర్స్ తెలిపారు. కావ్యథాపర్, సంజయ్‌దత్, అలీ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్.





## నాపై తప్పుడు కేసులు పెట్టారు

యువహీరో రాజ్‌తరుణ్ లావణ్య వివాదం గత కొద్ది రోజులుగా హాట్‌టాపిక్‌గా మారింది. గత పదకొండేళ్లుగా రాజ్‌తరుణ్‌తో తాను సహజీవనం చేస్తున్నానని, తనను పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి మోసం చేశాడని లావణ్య ఇటీవల నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఈ కేసు పోలీస్ విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్ర ప్రీరిలీజ్ వేడుక బుధవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించగా అక్కడ రాజ్‌తరుణ్‌ను కలుసుకోవడానికి వచ్చిన లావణ్యను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రికత్త చోటుచేసుకుంది. తన భర్త రాజ్‌తరుణ్‌తో మాట్లాడాలంటూ లావణ్య పోలీసులతో వాగ్వాదానికి దిగింది. అనంతరం ఈ వివాదం గురించి రాజ్‌తరుణ్ ప్రెస్‌మీట్‌లో స్పందించారు. ఆయన మాట్లాడుతూ 'లావణ్య నాపై చేసిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదు. అందుకే ప్రతీసారి మీడియా ముందుకొస్తున్నది. ఈ విషయంలో నేను లీగల్‌గా వెళ్తున్నాను. నేను ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నాపై తప్పుడు కేసులు పెట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. నేనేం తప్పించుకొని తిరగడం లేదు. పోలీసుల నోటీసులపై నేను స్పందించాను. నాకు ఇండస్ట్రీలో ఎంతో మంది సన్నిహితులున్నారు. నేను మంచి వాడిని కాదని ఇండస్ట్రీలో ఎవరైనా చెబితే ఇక్కడి నుంచి వెళ్లిపోతాను' అని రాజ్‌తరుణ్ చెప్పారు. ఏ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన 'తిరగబడరా సామీ' చిత్రం ఆ నెల 2న ప్రేక్షకుల ముందుకురానుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com